
# నేను ఎలక్ట్రాన్



నా గురించి నేను చెప్పుకోవడం బావుండకపోయినా, చెప్పక తప్పటల్లేదు. అసలు చిన్నప్పట్నుంచీ నాది చాలా దుడుకు స్వభావం. దుడుకుగా ఉండడం ఏమంత సులువైన పని కాదు. హైస్కూల్లో వాతలు తేరేటట్లు తిన్న దెబ్బల్ని గురించీ, కాలేజిలోనూ, యూనివర్సిటీలోనూ-నేను యిరుక్కున్న విషమ పరిస్థితులను గురించి చెప్తే, దుడుకుతనంలో సర్టిఫికేట్ సంపాదిం

చదడం ఎంతకష్టమో, మీకు తెలుస్తుంది. ఎటొచ్చీ మెదడులో బండతనంలేదు కాబట్టి, చదువులో వెనకబడకుండా అన్ని మెట్లూ అవలీలగా దాటి, చదువు పూర్తయిందనిపించాను.

రోజులు మారిపోయాయి. నేను పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీ సంపాదించే సరికి, ఉద్యోగాలు నిండుకున్నాయి. ఇంటర్వ్యూలు ఎంత బాగాచేసినా, సిఫారసులు లేకపోవడం మూలాన ఉద్యోగం దొరకలేదు. అన్ని ఆశలూ ఉడిగిపోయిన తర్వాత, ఊరికే గోళ్ళుగిల్లుకొంటూ కూర్చోడం నాకే అసహ్యమనిపించింది. నాన్న వ్యవసాయంలోకి దిగమన్నారు. సరేకదా అని దిగాను. పొలంపని వాళ్ళ ఎదుట గొప్పకోసం, సులువు తెలియకుండా అరకట్టిన ఎడ్లను, అదిలించడం నేను మొదటి రోజునే చేసిన తప్పుపని. నల్లెద్దు నా కంటె పొగరుబోతుదవడం మూలాన, కసిదీరా తన్నింది. మోకాలంతా వాచి ఇరవై రోజులు మంచంపట్టాను. మూతి పళ్లు విరగనందుకు సంతోషించాను. ఆ నల్లెద్దుకూ, నాకూ పడదన్న సంగతి తెలిసిన తర్వాత, మళ్ళీ పొలంలో అడుగుపెట్టడానికి నాకు మనస్కరించలేదు. అయినా వ్యవసాయం చెయ్యమని, బ్రహ్మదేముడు నా నుదుట వ్రాయలేదనుకొంటాను.

ఇంకేం చెయ్యడానికీ తోచక బి. ఇడి. లో చేరాను–మధ్యలో ఏదైనా ఉద్యోగం వస్తే, స్వస్తి చెప్పేద్దామన్న ఉద్దేశ్యంతో. కాని బి. ఇడి. డిగ్రీ కూడా చేతికొచ్చి కూర్చుంది. దాన్ని పట్టుకొని మరో ఏడాది కూర్చున్నాను. బోర్డువాళ్ల ధర్మమా అని ఒక్కుమ్మడిగా ఓ నలభై ఖాళీలు వచ్చాయి. ముప్పై ఆరు ఖాళీలు సిఫారసులవల్లా, నాలుగు ఖాళీలు క్వాలిఫికేషన్లవల్లా భర్తీచేశారు. ఆ నలుగురిలో నేనూ ఒకణ్ణయినందుకు ఎంతగానో సంతోషించాను. మొదటిసారిగా కోరుమిల్లి హైస్కూల్లో పడేశారు. అ రోజునుంచీ మొదలైంది, నా బడిపంతులి జీవితం.

చదువుకొంటూన్నప్పుడు, నేను ఎంత పొగరుబోతుగా ఉన్నా, చదువు చెప్పే స్థితికి వచ్చేసరికి, నా విద్యార్థులు పొగరుబోతులుగా ఉండడంమటుకు, సహించలేకపోయాను. అందులోనూ, అక్షరం ముక్కకూడా రాకుండా దౌర్జన్యంగా ఉండేవాళ్ళను సహించలేకపోయాను. అందుమూలంగా, ఆ ఊరి మునసబుగారి సుపుత్రుడు సుబ్బారావు నాకు నంబర్ వన్ శత్రువయి కూర్చున్నాడు. నాలుగైదుసార్లు వాడిని కఠినంగా శిక్షించడంతో, అతగాడి మేనమామ - అంటే ఆ ఊరి ప్రెసిడెంటుకూడా కోపం వచ్చింది. దాంతో మా హెడ్మాస్టరు యిరుకులో పడిపోయాడు.

తొమ్మిదో క్లాసు సంవత్సరాంతం

పరీక్షల్లో కాపీ కొట్టకుండా సుబ్బారావు కడ్డుతగిలాను. నేను దిద్దిన ఇంగ్లీషు, లెక్కల పేపర్లలో బండసున్నాలు వచ్చాయి. హెడ్మాస్టరు సుబ్బారావుని పాస్ చేసెయ్యమన్నాడు. అతగాణ్ణి నా యింట్లో కూర్చోబెట్టి ఆ రెండు పేపర్లూ మళ్ళా రాయించమన్నాడు. "దుష్టుల్ని త్వరగా వదిలించుకోడాని కిదో మార్గం! వాణ్ణి తొమ్మిదోక్లాసులోనే ఉంచేస్తే మరో రెండేళ్ళపాటు వాడి బాధలు స్కూలుకి తప్పవు! వాణ్ణి కనక పదో క్లాసులో పడేస్తే ఒక్కఏడాదిలో వాడి పీడా విరగడవుతుంది." ఇదీ ఆయన సిద్ధాంతం. అందులో నిజం లేకపోలేదు. యూనియన్ లీడర్లని ఆఫీసర్లుగా ప్రమోట్‌చేసి, వాళ్ళ కోరలు పీకి వెయ్యడం జరుగుతున్నదే! అయినా, నా అభిమానం, కర్తవ్యం అడ్డుతగిలాయి "నేను కోరుమిల్లి హైస్కూల్లో పనిచేస్తున్నంతకాలం– ఈ సుబ్బారావునే కాదు – ఏ సుబ్బారావునీ కూడా అగడాలు చెయ్యకుండా ఆపుచేస్తాను. ఈ విషయంలో మీరు నిర్భయంగా ఉండండి!" అన్న నా సమాధానం విని, ఆయన మరి మాట్లాడలేకపోయాడు. సుబ్బారావు తొమ్మిదో క్లాసులోనే ఉండిపోయాడు.

కాని, అనుకొన్నట్టుగా నేను కోరుమిల్లిలో ఉండలేకపోయాను. ఉండనివ్వలేదు. సుబ్బారావు బంధువర్గంలో ఒకాయన తాడిపత్రి ప్రెసిడెంటుగారట. పులిని కోరలుపీకి పిల్లిగాచేసే హస్తవాసి, తలలుమార్చే రాజకీయ చతురతా ఆయనకి ఉగ్గుపాలతోనే పెట్టిన విద్య లట. అందుకని కోరుమిల్లి ప్రెసిడెంటూ, మునసబూ కలిసి నన్ను తాడిపత్రి బదిలీ చేయించారు–నా కోరలు పీకించడానికి! కూతురి పెళ్ళికి కావలసిన సంబారాలన్నీ సమకూర్చిన ప్రెసిడెంటుగారి ఋణం తీర్చుకోవడం కోసం, హెడ్మాస్టరు ముఖావంగా ఉండిపోయాడు!

కోరుమిల్లినుంచి తాడిపత్రి మకాం మార్చాను. నాకంటే ముందుగా నా వివరాలు తాడిపత్రి చేరటం, నా కాశ్చర్యమనిపించలేదు. నేను ఎటువంటి చిక్కులు తెచ్చిపెడ్తానో ఏమో నన్న భయంతో హెడ్మాస్టరు సతమతమవుతూన్న సంగతి, మొదటి పరిచయంలోనే పసిగట్టాను. నేను గౌరవంగా మాట్లాడ్డంతో, ఆయన చాలామట్టుకు, కుదుటబడ్డాడు మిగిలిన టీచర్లనందర్నీ పరిచయంచేశాడు. అందర్నీ అంచనా వెయ్యడం కష్టమనిపించలేదు. మూడువంతులు ప్రెసిడెంటువర్గంలోనివాళ్లు, మిగిలినవాళ్లు ఆ ఊరి కరణం మున్సబులకి మద్దతు యిచ్చే ఉద్దేశ్యంగలవాళ్ళయినా, భయంకొద్దీ తటస్థంగా ఊరుకొన్నవాళ్లు.

ఆ రోజు మధ్యాహ్నం విశ్రాంతి

సమయంలో, టీచర్ల రూంలో కబుర్లాడు తుండే సమయంలో, ప్రెసిడెంటుగారి మనిషొకడు వచ్చి, 'ప్రెసిడెంటుగారు మిమ్మల్నోసారి వచ్చి ఆయన్ని కలుసు కోమన్నార'ని చెప్పాడు. నాకు మూడు రోజులవరకూ తీరుబడిలేదని చెప్పి, అతగాణ్ణి పంపించేయడంతో అందరూ అదోలా చూశారు. డ్రాయింగ్ టీచరు అవధాని ఆ రోజు సాయంత్రం, రహస్యంగా నాకు చాలా విషయాలు చెప్పి, 'ప్రెసిడెంటుతో వ్యవహారమంటే కత్తి మీద సాములాంటిది. అందుకని జాగ్రత్తగా ఉండడం మంచిది !' అని హెచ్చరించాడు.

అవధాని సాయంతో, ఆ రోజే, ఊరి చివరగా ఉన్న ఓ పాతకొంపలో ఓ వాటా, పాతిక రూపాయలకి, అద్దెకు తీసుకొన్నాను. అద్దె తక్కువని వింత పడనవసరంలేదు. ఆ యింట్లో దెయ్యాలున్నాయని ప్రతీతి. ఆ యింటి యజమానికి, పక్కింటాయనకీ కక్షలు. అందుకని పక్కింటాయన చేసిన ప్రచారమని, ఆ యింట్లో దిగిన తర్వాత తెలిసింది. ఏమైతేనేం, ఉండడానికి నాకింత చోటు దొరికింది.

అయితే నేను ప్రెసిడెంటు చౌదరిని కలుసుకొన్నది, మూడురోజుల తర్వాత కాదు. వారంరోజుల తర్వాత ! నేను వెళ్ళేసరికి తన లంకంత కొంపలో, ముందు వసారాలో వందిమాగధులమధ్య కొలువుతీర్చి ఉన్నాడు చౌదరి. నన్ను నేను పరిచయం చేసుకొన్నాను. నన్ను కూర్చోమని అడగనూలేదు – నేను కూర్చోనూలేదు. తాపీగా నోట్లోంచి చుట్ట తీసి, "ఏమయ్యా, ఇప్పుడా నీకు తీరుబడి దొరికింది ?! కాని నాకు నీతో మాట్లాడ్డాని కిప్పుడు వీలుకాదు," అన్నాడు హేళనగా. అందరూ ఘొల్లున నవ్వారు. నాకు వళ్లుమండుకుపోయింది. ఆత్మాభిమానం రెచ్చగొట్టింది. "ఈ ఊరి హైస్కూలు హెడ్మాస్టరుగారున్నంతవరకూ మీతో మాట్లాడ్డానికి నా కేవిధమైన అవసరమూలేదు - రాదు కూడా ! ఆ రోజున, మీరు నాకు కబురంపడంలో మట్టుకు ఏం రాచకార్యముంది కనక ? నన్నూ, నా ఆకారాన్నీ చూడాలన్న ఉద్దేశ్యం తప్ప ! అదే కనక నిజమైతే ఇప్పుడు మీ కోరిక తీరే ఉంటుంది. మీకు తీరుబడిలేకపోయినా నాకు ఒరిగేదేమీలేదు !" నేనన్నమాటల కక్కడున్న వాళ్ళందరూ అదిరిపోయారు. చౌదరి ముఖం జేవురించింది. తిరిగి సమాధానం చెప్పలేకపోయాడు. ఆయనగార్ని వందిమాగధులకు వదిలేసి, బయటకు దారితీశాను.

నేను గేటు తీసుకొని బయటకు వెళ్లే ప్రయత్నంలో ఉండగా చౌదరి భార్యా, ఇరవైఏళ్ళ కూతురూ, లోపలికి వస్తూ నా కంటబడ్డారు. గుళ్లోంచి తిరిగి వస్తూన్నట్లు, వాళ్ల ఆకారాలు చెప్తున్నాయి.

అది ఎటువంటి బలవత్తరమైన ముహూర్తమో కాని, చౌదరి కూతురు నా హృదయంలో ఎగిరి కూర్చుంది ! ఆ క్షణంలో నేను ఒకే ఒక్క నిర్ణయానికి వచ్చేశాను. చౌదరి యింటి అల్లుణ్ణయి తీరాలి. అది చౌదరిమీద ద్వేషంవల్ల కాదు. చౌదరి కూతురిమీద నాకు కలిగిన అపారమైన ప్రేమవల్ల !

నేను వలచిన యువతి అంద చందాల్ని గురించి, ఒంపుసొంపుల్ని గురించి చెప్పడం, ఏమంత న్యాయం కాదు. నాకు నచ్చిన అందం, ఆమెలో ఉంది. నా మనస్సుని ఆకట్టుకొనే ఆకర్షణ ఆమెలో ఉంది. అంతకంటె నాక్కావల్సిందేముంది ?

అవధానిద్వారా మరికొన్ని వివరాలు తెలుసుకొన్నాను. ఆమె పేరు వరలక్ష్మి. ఆ ఊరి హైస్కూల్లో స్కూల్ఫైనల్ వరకూ చదివింది. మేనరికాల్లాంటి సంబంధాలేమీ లేవు. ఆ సంగతి వింటూంటే, నా కెంత ఆనందం కలిగి ఉంటుందో, మీ రూహించడం కష్టం కాదనుకొంటాను

రోజులు నెమ్మదిగా నడుస్తున్నాయి. నా వలపుల తలపుల్లో వరలక్ష్మి వీర విహారం చేస్తోంది కలల్లో కన్పించి కవ్విస్తోంది.

ఓ శనివారంరోజు చీకటిపడ్డాక ఏమీ తోచక స్కూలుకు పోయాను, స్కూల్లో నా డ్రాయర్లో మర్చిపోయిన ఓ నవల తెచ్చుకొందామని. అప్పుడే స్కూలు ఆవరణలోంచి ఓ ఖాళీ లారీ బయటకు వస్తోంది. వాచ్మన్ని సంగతేమిటని అడిగాను. మాట తప్పించి ఏదో సొద వాగాడు. అతగాడు మా టీచర్ల గది తాళం తీయగానే, నా నవల తీసుకొని బయటపడ్డాను. నా కేమిటో అనుమానం వేసింది. వరండాలోంచి వస్తూంటే, ధాన్యం వాసనవేసింది. అవధానిదగ్గరకు వెళ్ళి ఆరా తీశాను. ఆ మర్నాడు, ధాన్యసేకరణకోసం ప్రభుత్వాధికారులు వస్తున్నారు. చౌదరి తాలూకు రెండు వందల బస్తాలు స్కూల్లో దాచేశారు రహస్యంగా. ఎవరూ అనుమానించలేని చోటు. చౌదరి మాస్టరందరికీ తలో బస్తాడు ధాన్యం యిస్తాడు. తనిఖీదారులు ఊళ్ళోంచి వెళ్ళిపోగానే, ఆదివారం రాత్రి ధాన్యం చౌదరి కొట్లోకి తరలించ బడుతుంది !

నాకు బుర్ర తిరిగిపోయింది ! పంచాయితీ రాజ్యం - రామరాజ్యం - ఏమిటో యివన్నీ అర్థంలేని పదాలు. అధికారంలో ఉన్నవాళ్ళ చేసే అవినీతిపనులవల్ల, దేశం యిలా మండిపోతోంది.

ఆ రాత్రి భోజనంచేసిన తర్వాత, యింటి యజమాని సైకిలు తీసుకొని, నాలుగు మైళ్ళదూరంలో ఉన్న మేడి గుట్ట వెళ్ళాను. అక్కడ పోస్టాఫీసు నుంచి, నాకు తెలుసున్న ఓ స్నేహితుడికి కాకినాడ ఫోనుచేసి వచ్చాను. ఆ

రాత్రి ఏదో సంతృప్తి నన్నావరించింది. అజ్ఞాతంగా ప్రభుత్వానికి సహాయం చేశానన్న ఓ గర్వం నాలో విస్తరించింది.

ఆ మర్నాడు జరిగిన సంఘటనలకి నా మతిపోయింది. అధికారులు లౌక్యంగా స్కూలుని తనిఖీ చేసినప్పుడు, ఒక్క ధాన్యపుగింజ కూడా కనబడలేదు ! తాడిపత్రి పోస్టుమాస్టరుమీద నమ్మకం లేక, పక్క ఊరెళ్లి ఫోనుచేసినా ఫలితం లేకపోయింది ! ప్రభుత్వా లిచ్చే జీతాలు సరిపోనప్పుడు, చిన్న జీతాల ఉద్యోగులు, స్థానికంగా ఉన్న బల వంతుల ప్రాపకం సంపాదించలేకపోతే మనుగడ సాగించడం కష్టమన్న సత్యం కొట్టవచ్చినట్లు తెలిసింది. మేడి గుట్ట పోస్టుమాస్టరు నేను ఫోనులో మాట్లాడిన వివరం, ఆ రాత్రే చౌదరికి తెలియచేశా డనుకొంటాను. రాత్రికి రాత్రే ధాన్యం మరో చోటుకి రవాణా అయిపోయింది ?

అయితే నా పరాజయాన్ని నలుగురికీ చాటుకోలేదు. చౌదరికూడా తన విజ యాన్ని చాటుకోలేదు. అయితే చౌదరి నా పరాజయాన్ని నాకు వేలెత్తి చూప కుండా ఉండలేకపోయాడు. ఊరి శివార్లలో ఉన్న రామాలయంలో హరికథ జరుగుతున్నప్పుడు, ఎదురుపడ్డం తట స్థించింది. నన్ను చూసి మందహాసం చేశాడు. ఆ మందహాసంలోనే, వందర్థాలు గోచరించాయి !

క్లాసులో కుర్రాళ్లు యాగీపెట్టడం మొదలుపెట్టారు. వాళ్ళ ప్రతాపాలకి లొంగలేదు సరికదా, వాళ్లని తీవ్రంగా దండించడం చూసి, హెడ్మాస్టరు కూడా భయపడిపోయాడు. పెద్ద శాస్త్రిలు గారని, ఆ ఊళ్ళో బాగా పలుకుబడి ఉన్న పెద్దమనిషి, ఎడాపెడా దానాలు స్వీకరించి, పెద్ద మోతుబరయి కూర్చు న్నాడు. ఆయనగారి సుపుత్రుడు రామ బ్రహ్మం మా స్కూల్లో చదివే విద్యార్థి. అతగాడు హోంవర్కు చెయ్యనందుకు, ఓ రోజు చీకటిపడిన చాలాసేపటివరకు క్లాసులోనే ఉంచేశాను. నేనుకూడా ఉండ వలసి వచ్చింది. చచ్చీ చెడి హోం వర్కుని క్లాసులో పూర్తిచేసి, పదిం టికి ఇంటికి వెళ్ళాడు రామబ్రహ్మం. మర్నాటి ఉదయానికి ఊళ్లో సగంభాగం అట్టుడికి నట్టుడికిపోయింది. నన్ను కర్కోటకుడన్నారు. కిరాతకుడన్నారు. శాస్త్రులిగారి పొలంలో పనిచేసే యాద వులు కొంచెం పొగరుబోతు. వాణ్ణి నా మీదకు ఉసిగొల్పి పంపారు. ఆ రోజు సాయంత్రం నేనూ, అవధానీ 'లక్ష్మీ విలాస్' కాఫీ హోటల్లోంచి బయటకు వస్తోంటే, యాదవులు కావాలని నాతో గిల్లికజ్జా పెట్టుకున్నాడు. చాలావరకు శాంతంగానే సమాధానాలు చెప్పాను. నే నెంతకూ చెయ్యిచేసుకోకపోవడం

చూసి, అతగాడు రెచ్చిపోయాడు. చివరి కింక ఉండబట్టలేక, నన్ను సైడు కాల్వలోకి మెడపట్టి గెంటాడు. నేనెదురు చూసింది కూడా, అటువంటి చర్య కోసమే. తాపీగా లేచి వంటికంటిన బురదని విదుల్చుకొన్నాను. యాదవులు నా కేసి చూసి నవ్వుతున్నాడు, విజయ గర్వంతో. వాడి చూపుల్ని నా చూపుల్లో ఆకట్టుకొని, ఎగిరి డొక్కలో తన్నాను. రోడ్డుమీద వెల్లకిలాపడ్డాడు. పడ్డవాడు మళ్ళీ లేవకుండా, మీదపడి చితక్కొట్టేశాను. ముందు చెయ్యిచేసుకొన్నది వాడే కాబట్టి, నన్నాపడానికెవరూ సాహసించలేదు. చొక్కాపట్టుకొని, యాదవుల్ని శాస్త్రు లింటికి లాక్కు వెళ్ళాను. నన్ను చూసిన రామబ్రహ్మం జారుకోబోయాడు. యాదవుల్ని వదిలి, రామబ్రహ్మం కాలరు పట్టుకొని ఆపాను. నశ్యప్పట్టు పట్టోన్న శాస్త్రులు నన్ను చూసి నిర్ఘాంతపోయాడు. "చూడు రామబ్రహ్మం! నీ తాతలు చేతులు చాచి సంపాదించిన ఆస్తులు వెనుక ఉన్నాయని చదువులు నిర్లక్ష్యం చేస్తే, రేపటిరోజున నువ్వు విచారించక తప్పదు! దేశంలో వ్యవస్థ మారిపోతోంది.

"మరో దశాబ్దంలోగా వచ్చే మహాప్రవాహంలో, నీ తాతల ఆస్తులు కొట్టుకుపోతాయి అప్పుడు నీ కండగా నిల్చేది నీ విద్యే. ఆ రోజున అవసర మెచ్చి నువ్వు చేతులు చాచినా, భూములు దానాలు చేసేవాడెవడూ ఉండడు! ఓ పైసాతో చీదరించుకొంటూ విదుల్చుకొంటారు. నేను నిన్ను శిక్షించానంటే, నీమీద కక్షకొద్దీకాదు. నా ధర్మం నెరవేర్చుకోడానికే. వస్తాను. వెళ్ళేముందు మీ అందరికీ ఓ మాట. గురు శిష్యులమధ్య గోడపలకి మెలితిపెట్టి, నాటు పశువుల్ని మీద కుసికొల్పితే, చూస్తూ ఊరుకోడానికి, నేను గాజులు తొడిగించుకోలేదు!" అనవలసిన నాలుగూ అనేసి, రోడ్డుమీదపడ్డాను. ఎవరూ నోరెత్తలేదు. తర్వాత పది రోజులవరకూ, పెద్దశాస్త్రు లింటి పట్టునే ఉండిపోయాడు.

ఈ సంఘటన జరిగిన తర్వాత, మునసబు, కరణాలు, నన్ను ఇచ్చితంగా వాళ్ళ మనిషిగానే భావించి, దువ్వడానికి ప్రయత్నించారు. ముఠా తత్వాలు నా కిష్టంలేదని, వాళ్లని దరి చేరనివ్వలేదు.

ఏమిటో ఈ హీరో లక్షణాలు వచ్చేసినా, వరలక్ష్మి విషయంలో ముందంజ వెయ్యలేకపోయాను. కలలు కనీ, ఊహాగానాలుచేసీ విసుగెత్తిపోయాను. రౌడీల నుంచి రక్షించడం, పోట్లగిత్త బారినుండి కాపాడ్డం, చెరువులో మునిగిపోతూంటే రక్షించడం - లాంటి సినిమా అవకాశాలు దొరకలేదు. ప్రయత్నంలేందే, ఏ పనీ సాగదుకదా! ఊరి శివార్లలో



ఉన్న రామాలయానికి దర్శనాలు ఎక్కువ చేశాను. నాలుగైదుసార్లు వరలక్ష్మి కంటపడ్డది. కాని తల్లి కూడా ఉండడంవల్ల సాహసించలేకపోయాను.

రాములవారికి, ఓ రోజున నామీద అనుగ్రహంకలిగింది. వాళ్ళమ్మకి జ్వరం లాంటి దేదో వచ్చి ఉంటుంది! వరలక్ష్మి ఒంటరిగా వచ్చింది. ఒంటరిగా వచ్చినా ఆమె కొచ్చిన ప్రమాదం ఏముంది కనక ? ప్రెసిడెంటు గారమ్మాయిని కన్నెత్తి చూడ్డానికి, ఆ ఊళ్లో దమ్ము లెవరికుంటాయి ?

అస్తమిస్తూన్న సూర్యుడి ఎర్ర దనంలో ఆకాశం అలుక్కుపోయింది. తామరకొలను తళతళా మెరిసిపోతోంది. ఆలయానికి దూరంగా గోచీలు పెట్టు కొన్న కుర్రాళ్ళు, గోలీ లాడుకొంటు న్నారు. రాములవారికి తోడుగా పూజారి

తప్ప, మరెవ్వరూ గుళ్లోలేరు. వరలక్ష్మి ఒంటరిగా దర్శనానికి కొచ్చింది. అన్నీ కుదిరాయి. ప్రకృతి బావుంది. సమయం దొరికింది. కాని నాకు ధైర్యమే చాల్లేదు! రాళ్ళను పిండిచేసేవాడి చేతిలో వెన్న ముద్దని పెట్టి నిభాయించమంటే ఎంత కష్టమో, ముక్కుకు సూటిగా మాట్లాడే నాకు, నీలంరంగు డిసెంబరు పువ్వులాంటి వరలక్ష్మితో మాట్లాడ్డానికి, గగనప్రయత్నమే చెయ్యవలసివచ్చింది. మండపం దిగి కిందికి వస్తూన్న వరలక్ష్మితో, "నేను మీకు తెలుసునను కొంటాను ?" అనగలిగాను. వెధవది, నా ఈ మొదటి మాటల్లోకూడా అహమే తొంగిచూసింది. అన్న తర్వాత, నాలిక్కరుచుకొన్నాను. తెలియదంటే, తలకొట్టేసినట్లేకదా ! వరలక్ష్మి సమాధానంకోసం నేను చూపిన ఆతృత, అంతవరకూ నా జన్మలో మరే విషయంలోనూ చూపలేదు. వరలక్ష్మి ముందుగా కొంచెం తడబడింది. అయినా నిలదొక్కుకుని నెమ్మదిగా అంది – "ఎందుకు తెలియదు ? మా నాన్నగారికీ, ఆయన స్తోత్రపాఠకులకీ జరిగే ప్రస్తావనలు–మూడొంతులు మీ మీదనే !" వరలక్ష్మి అంత చక్కగా సమాధానం చెప్తుందని నే నూహించలేకపోయాను. వెంటనే నవ్వుతూ అన్నాను – "అంటే, నామీద మీకు దురభిప్రాయం ఏర్పడిపోయిందనుకొంటాను ?"

వరలక్ష్మి అందంగా నవ్వింది. "మీ రనుకొన్నదే నిజం అయితే మీ మొదటి ప్రశ్నకు సమాధానం యిచ్చేదాన్ని కాను !"

నాలో వెయ్యి ఏనుగుల బలం పుంజుకొచ్చింది. నాలోని ఉత్సాహం హిమాలయను శిఖరాగ్రాలని దాటి పెరిగిపోయింది. ఆ తర్వాత వరలక్ష్మితో – నా కిష్టమైన డిసెంబరు పువ్వుల్ని గురించీ, తామరకొలను గురించీ, పల్లె వాతావరణం గురించీ, ఏం మాట్లాడానో నాకే తెలియదు. ఉన్నట్టుండి వరలక్ష్మి కదిలింది. "ఆలస్యమైపోయింది, వస్తాను." వెళ్లిపోతున్న వరలక్ష్మితో అన్నాను – "ఈ ఊరొచ్చిన ఇన్నాళ్లకు, నాకు నిజంగా చాలా ఆనందంగా ఉంది. నేను ప్రతిరోజూ సాయంత్రం ఇక్కడకు రావడానికి అలవాటుపడిపోయాను." అర్థమైందన్నట్లుగా తలూపి, వరలక్ష్మి వెళ్ళిపోయింది. ఆ రాత్రి నాకు నిద్ర పట్టిందని మీ రనుకొంటే, అది పొరపాటు.

రాములవారి దర్శనం ప్రతిరోజూ చేసేవాణ్ణి. ఒక్కో సాయంత్రం భక్తులెక్కువైతే, నాకు ఆశాభంగం అయ్యేది. వారం మొత్తంమీద ఏ రెండు మూడు రోజులుమాత్రమే, వరలక్ష్మితో మాట్లాడ్డానికి వీలుపడేది. లేకపోతే చూపుల తూపులే గతి. ఇలా కొన్ని వారాలు జరిగిపోయాయి. ఆ ఊళ్లో తెలివైన

వాడు ఎవడైనా ఉన్నాడూ అంటే – గుళ్ళో పూజారి మాత్రమే. మమ్మల్ని గురించి నోరు మెదపలేదు. మధ్య మధ్యలో తనూ వచ్చి మాతో కూర్చుని ఏవో కబుర్లు చెప్పేవాడు. ఓ రోజున – వరలక్ష్మి రాని రోజున, పూజారి నన్ను నెమ్మదిగా హెచ్చరించాడు. "మీరు ఆలోచించే గమ్యమేమిటి ?" అంటూ. అప్పుడు నే నాయనతో అన్నాను– "మీ కీపాటికి అర్థమయ్యే ఉంటుంది. వరలక్ష్మిని పెళ్లిచేసికొందా మను కొంటున్నాను. ఇంతవరకూ వరలక్ష్మిని నేను ధైర్యంచేసి అడగలేదు. ఆ కార్యభారం మీరు వహిస్తే చాలా సంతోషిస్తాను."

పూజారి ఒక్కక్షణం మాట్లాడలేదు. "ఆ పిల్ల మనసు వేరే అడగాలా ? కాని ఈ వర్ణాంతర వివాహం ఎంత కష్టమో ఆలోచించావా ? అందులోనూ మతాతత్వాలతో నలిగిపోయే ఈ పల్లె పట్టులో, ఈ శుభకార్యానికి వీలుపడ దేమో ?" ఆయన నెమ్మదిగా అన్న మాటలకి నేను వెంటనే సమాధానం చెప్పలేకపోయాను. నే నంతదూరం ఆలోచించలేదు కూడా ! అదే సంగతి అన్నాను. "మీ రన్నది నిజమే. నేనంత దూరం ఆలోచించలేదు. అయినా రాబోయే అవరోధాలను ముందుగానే ఊహించి, బాధపడేవాణ్ణికాదు నేను. ముందుగా నాక్కావల్సింది వరలక్ష్మి అంగీకారం. తర్వాత విషయాలు తర్వాత చూసుకొందాం."

ఆ మర్నాడు సాయంత్రం నే నాల యానికి వెళ్ళలేదు. రాత్రి పదిదాటిన తర్వాత, పూజారి వచ్చి తలుపుతట్టాడు. తలుపు తీసి లోపలికి రమ్మన్నాను. గుమ్మంలో నిల్చునే అన్నాడు. "నువ్వూ –వరలక్ష్మి ఒకరికోసం మరొకరు పుట్టారు. అయితే ఈ వ్యవహారం ఎలా నడుక్కొస్తావో, అంతా నీవే ఆలో చించుకో. వరలక్ష్మి, ఆ శుభఘడియ కోసం ఎదురుచూస్తోంది !" అంతటి శుభవార్తని చెవిని పడేసిన పూజారిని కౌగలించుకోకుండా ఉండలేకపోయాను.

రెండురోజుల తర్వాత గుడి వెనక మండపంలో వరలక్ష్మిని కలుసుకో గలిగాను. వణుకుతున్న చేతులతో వరలక్ష్మి జడలో గులాబీలు తురుము తోంటే, కిసుక్కున నవ్వింది. ఆ నవ్వే, కోటి రాగాలై నన్ను ముంచేసింది.

ఇక్కడ వరలక్ష్మితో ఎన్నో మధుర క్షణాలు గడిపేస్తున్నా, అక్కడ స్కూల్లో నాకు ప్రతిఘటన ఎక్కువవడం మొదలైంది. హెడ్మాస్టరు మింగలేకా, కక్కలేకా బాధపడ్డం మొదలుపెట్టాడు. మళ్లీ ఇంకోసారి, పెద్దశాస్త్రులు కొడుకు రామబ్రహ్మన్నీ, వాడి నేస్తగాణ్ణీ దండించవలసి వచ్చింది. ఆ నేస్తగాడి తండ్రికూడా బాగా పలుకు బడి ఉన్న పెద్దమనిషి. ఆ ఊరి మాల

గూడెం అంతా అతని చేతుల్లో ఉంది. అగ్రహారంలో, పెద్దశాస్త్రులుకీ మంచి పట్టే ఉంది. చౌదరికి, ఓట్లదృష్ట్యా వీళ్ళిద్దరూ కావల్సినవాళ్లు! వీళ్ళిద్దరూ తమ పరువు గంగపాలయిందని, యిద్దై పోయారు. చౌదరి తన గ్రామం పరువే మట్టికొట్టుకుపోయిం దనుకోవడంతో, నేను తను పిలిపించినా రానన్న సంగతి తెలుసు కాబట్టి, తనే ఓ రోజున నన్ను ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో బెదిరించాడు. "నువ్వు మమ్మల్నందర్నీ యిరకాటంలో పెడ్తున్నావు. ఇలాగైతే నిన్నిక్కణ్ణించి బదిలీచేయించవలసి వస్తుంది!"

అసమర్థుడైన హెడ్మాస్టరుకింద పని చెయ్యడం, నాకూ యిదిగానే ఉంది. అయితే ఈ ఊర్నించి బదిలీ వస్తే, నా జీవిత స్వప్నం ఏంకాను? వరలక్ష్మి లేకుండా ఎలా బతికేది? వాడి చూసి, చౌదరి ఆత్మాభిమానం దెబ్బతినేలా ఓ విసురు విసిరాను. "మీ బావగారు, మీచేత నా కోరలు పీకించడానికి నన్నిక్కడికి బదిలీ చేయించారు. మీ దగ్గర నెగ్గుకు రాగలిగినప్పుడు, నన్నెక్కడికి బదిలీచేసినా భయంలేదు. ఏదో మాస్టారుగా కుర్రాళ్ళని దండిస్తే అది మీరు వ్యక్తిగతంగా ఎందుకు తీసుకొంటున్నారో బోధపడటంలేదు. మీకూ, నాకూ మధ్య గెలుపు ఓటమిల ప్రసక్తి లేకపోయినా, మీ బావగారూ, అనుచరులూ, మిమ్మల్ని చూసి నవ్వుతారు. ఎంచేతనంటే ఈ బదిలీ నాకు శిక్షకాదు. మీ గౌరవానికి పరీక్ష!" చౌదరి కళ్లలో ఎరుపు చూసి నేను కొంచెం జంకిన మాట వాస్తవమే. మాట్లాడకుండా వెళ్లిపోయాడు. నాకు తెలుసు – చౌదరి నా బదిలీ గురించి యింక మాటెత్తడని. వియ్యంమాట దేము డెరుగు కాని, అన్నీ కయ్యాలకే అవకాశాలు వస్తున్న నా దురదృష్టాన్ని గురించి ఆలోచించి బుర్ర పాడుచేసుకొన్నాను.

ఎంత ఆలోచించినా, కొన్ని పనులు జరగడమనేది అసంభవం. అయితే, ఒకోక్కసారి అనుకోకుండా జరిగిన సంఘటనలు, మన ప్రయత్నాల్ని సులువుగా నెరవేరుస్తాయి. నా విషయంలో సరిగ్గా యిదే జరిగింది.

ఓ రోజున వరలక్ష్మి, నేనూ ఆలయం దగ్గరున్న తామరకొలను గట్టున చెయ్యీ చెయ్యీ పట్టుకొని నడుస్తూ, చౌదరి పాలేరు కుర్రాడు 'వెంకటేశు' కళ్ళపడిపోయాం. వరలక్ష్మి బెదిరిపోయింది. మరో అరగంటకల్లా ఈ వార్త చౌదరి కందిపోతుంది! అనవసరంగా గొడవపడి నవ్వులపాలు కావడం నాకూ యిష్టంలేదు ఏదో అదృశ్యమైన శక్తి, నా కా క్షణంలో గుండె ధైర్యాన్నిచ్చింది. అప్రయత్నంగా వెంకటేశుని పిల్చాను. తెల్లబోతూ, యిబ్బందిగా దగ్గర కొచ్చాడు. వెంకటేశు భుజాన్ని తట్టి అన్నాను–

"నువ్వు చూసిన సంగతి మీ అయ్యగారికి చెప్పకుండా నువ్వుండలేవని నాకు తెలుసు. ఆయనగారి ఉప్పు తిని బతుకుతున్నందుకు, ఈ సంగతి ఆయన చెవిని పడేయడం నీ ధర్మం! తప్పదు! కానీ మీ అమ్మాయిగారి పరంగా నే నొక్కటి అడుగుతున్నాను. రేపుదయం ఎనిమిదింటికి నా దగ్గరకు రా. ఆ దెయ్యాలకొంప నీకు తెలిసే ఉంటుంది. నీతోపాటు నేనూ, మీ అయ్యగారింటికి వస్తాను. చెప్పవలసిందంతా ఎదురుగుండానే చెప్పు. అయితే ఈ లోపుగా ఎవరితోనూ ఈ సంగతి చెప్పనని ప్రమాణం చెయ్యి. ఏమంటావు ?"
వెంకటేశు వరలక్ష్మివైపు చూశాడు. వరలక్ష్మి కళ్ళలో ఏం అభ్యర్థన చూశాడో కాని, వెంకటేశు యిబ్బందిగా తల ఆడించాడు. మరుక్షణంలో అక్కణ్ణించి కదిలి వెళ్ళిపోయాడు. నన్ను ప్రేమిస్తున్నట్లుగా తన తండ్రికి ధైర్యంగా చెప్పగలిగితే చాలని వరలక్ష్మికి నూరిపోసి యింటికి పంపించేశాను.

అక్కణ్ణించి తిన్నగా హెడ్మాస్టరింటికి వెళ్ళాను. "మీ అవసరం ఎంతైనా నాకు కలిగింది. మిమ్మల్ని నా పరంగా చౌదరి గారింటికి వెళ్ళమని కోరుతున్నాను." ఉపోద్ఘాతంగా నే నన్న మాటల కాయన నవ్వుతూ, "ఎందుకు? క్షమార్పణ లందచెయ్యడానికా ?" అన్నాడు.

"ఏం తప్పుచేశానని ? తప్పుగా ప్రవర్తించే కుర్రాళ్ళని దండించినందుకా ? ఈ విషయమై ఆయనతో అప్పుడే మాటలు జరిగాయి కూడా ! మిమ్మల్ని వెళ్ళమన్నది వేరే పనికోసం. వరలక్ష్మిని నా కిచ్చి పెళ్ళిచెయ్యమని అడగడంకోసం !" నా మాటలు విని ఆయన కొయ్యబారిపోయాడు. హాస్యాని కన్న మాటలు కాదని ఆయన గుర్తించాడు. తేరుకొని తాపీగా అన్నాడు- "నేను పిల్లలు కలవాణ్ణి. ఏదో నా మానాన నన్ను బ్రతకనియ్యి ! ఇప్పటికే మీ యిద్దరిమధ్యా నలిగి యాతనపడ్తున్నాను. ఈ రాయబారం కనక నేను చేస్తే, నీ పెళ్లిమాట ఎలా ఉన్నా, వచ్చే నెలలో జరగబోయే నా కూతురి పెళ్లి ఆగిపోతుంది. చౌదరిగారు ఈ విషయంలో నాకు చాలా సహాయం చెయ్యబోతున్నారు. ఈ భారం నువ్వు ఎవరి నెత్తినో పెట్టేకంటే, నువ్వే స్వయంగా వెళ్ళడం ఉత్తమం !"

అనుభవాన్ని కాచి వడబోసి అన్న మాటలు. నాకు నిజమే ననిపించింది.


మర్నాడుదయం వెంకటేశు వచ్చాడు. వస్తాడో, రాడో నన్న అనుమానం కలిగినా, 'రాకేం చేస్తాడు ?' అన్న మొండిధైర్యంతో కూర్చున్నాను. "మీతో మాట్లాడవలసిన అవసరం రాదనుకోవడం పొరపాటే అయిపోయింది. 'ఈ రోజున మీతో మాట్లాడ

వలసిన అవసరం వచ్చింది. వెంకటేశు, మీ కీ ఉత్తరం యిచ్చిన తర్వాత ఓ సంగతి చెప్తాడు. ఓ అరగంటలోగా నేనూ వచ్చి మిమ్మల్ని కలుసుకొంటాను" అని రాసి ఉంచిన ఉత్తరాన్ని వెంకటేశు కిచ్చి "మీ అయ్యగారి కీ ఉత్తరం యిచ్చిన తర్వాత, నిన్న నువ్వు చూసిన సంగతి నిర్భయంగా చెప్పు. నీ వెనక నేనూ వస్తున్నాను", అని చెప్పి పంపించాను.

అక్కడే బ్రహ్మాండం బ్రద్దలయ్యిందో నాకు తెలియదు! చౌదరి ఏ ప్రళయ కాల నృత్యంచేశాడో నాకు తెలియదు! కాని నేను వెళ్లేసరికి, వెంకటేశు గజగజలాడిపోతూ ఓ పక్కగా నిలబడి ఉన్నాడు. లోపలి గుమ్మందగ్గర వరలక్ష్మి నిర్లిప్తంగా నిల్చుని ఉంది. ఆమె నల్లటి బుగ్గలమీద కూడా తట్లు కనిపించాయంటే, చౌదరి ఎంత బలంగా చెయ్యి విసిరాడో ఊహించుకోగలిగాను. చౌదరి ముఖమంతా కందగడ్డలా చేసికొని, ఉడికిపోతున్నాడు. "వెంకటేశుకంటె మధ్యవర్తి నా కీ గ్రామంలో దొరకలేదు. మీకు సంగతి తెలిసే ఉందనుకుంటాను. వరలక్ష్మిని పెళ్లిచేసికొందామనుకొంటున్నాను," నాకున్న ధైర్యాన్నంతా కూడదీసుకొని, ఒక్కొక్క మాటా బలంగా అన్నాను.

"నువ్వు అడగ్గానే చేతిలో పెట్టడానికి, ఇదేమీ కూరగాయల బేరం కాదు. నా పరువు ప్రతిష్ఠలు నట్టేట్లో ముంచడానికి నువ్వు కంకణం కట్టుకొన్నట్లున్నావు. నా గుండెలమీద కుంపటిలా కూర్చున్న నువ్వు, శాశ్వతంగా నా నట్టింట్లో అడుగుపెట్టడం ఈ జన్మలో జరగనిపని!" చౌదరి అరుస్తూ అన్నాడు.

"వరలక్ష్మి, నేనూ పరస్పరం ప్రేమించుకొన్నాం. వరలక్ష్మి శ్రేయస్సే మీ ధ్యేయమైతే, ఈ వివాహానికి మీరు అడ్డుచెప్పకూడదు! చెప్తున్నారూ అంటే, కారణం—కుల మత భేదాల్ని విసర్జించలేని మీ పాతకాలపు బూజుపట్టిన భావాలా? లేక బంధుకోటిలోనూ, ఆశ్రితవర్గంలోనూ అలుసైపోతారన్న భయమా?" ఈ ఉద్రిక్త పరిస్థితిలో, అక్కడకు చేరిన కొంతమంది స్తోత్రపాఠకుల్ని నేను గమనించలేదు. వాళ్ళకి విషయం బోధపడే ఉంటుంది. చౌదరి పిచ్చివాడిలా కేకలు వేస్తూ, "నీ ప్రశ్నలకు సమాధానం చెప్పవలసిన అవసరం నాకు లేదు. ఈ ఊళ్లో నీ మొహం కనబడ్డానికి వీల్లేదు, జాగ్రత్త!" అని, పక్కగదిలోకిపోయి తలుపులు మూసుకొన్నాడు. అక్కడ చేరిన వాళ్ళందరూ చల్లగా జారుకొన్నారు. నేను మూసిన తలుపు దగ్గరగా వెళ్లి, "మీరు కోపంగా ఉన్నారు - ఈ వివాహం జరిగితే, మీకు బంధువర్గం కొంత యిబ్బంది కలిగిం




చినా, రాజకీయరంగంలో మట్టుకు మీ పేరు మరింత ప్రకాశిస్తుంది. ఆలోచించుకోండి. నేను సాయంత్రం మళ్ళీ వస్తాను," అన్నాను గట్టిగా. తట్లుతేరిన వరలక్ష్మి బుగ్గలమీద నిమిరి, ధైర్యంగా ఉండమని నెమ్మదిగా చెప్పి, చౌదరి యిల్లు వదలి వెళ్ళాను.

మరో గంటకల్లా ఊరంతా అట్టుడికి నట్టుడికిపోయింది. చిలవలు పలవలుగా పెరిగి, చైనాదేశపు భయంకర విషసర్పంలా, ఊరంతా మా సంగతే ఆక్రమించింది. స్కూలుకి సెలవుపెట్టి, రామాలయానికి పోయాను. పూజారి బలవంతంమీద యిన్ని మెతుకులు తిన్నా, సహించలేదు. మధ్యాహ్నం అవధాని రొప్పుకొంటూ వచ్చాడు. "ప్రమాదం ముంచుకొస్తోంది. నువ్వు చౌదరితో ఘర్షణపడ్డ సంగతిని మునసబు కరణాలు వాడుకో జూస్తున్నారు. ఈ రాత్రికి నిన్ను కొట్టించడానికి, వాళ్లన్ని ఏర్పాట్లూ చేశారు. అయితే ప్రజలకి, చౌదరి ఈ ఘాతుకం చేయించినట్లు కనపడ్తుంది. చౌదరిమీద కసి తీర్చుకోవడానికి నిన్ను ఎరగా వేస్తున్నారు. నువ్వు రెండో కంటివాడికి తెలియకుండా వెంటనే ఊరు విడిచి వెళ్లిపో. ఈ రహస్యం నాకెలా తెల్సిందని అడగొద్దు!" చెప్పవలసింది చెప్పి, తన పని అయిపోయినట్లుగా అవధాని హడావుడిగా వెళ్లిపోయాడు

ఆ సాయంత్రం చౌదరి యింటికి అన్నట్లుగానే వెళ్లాను. వెంకటేశు యింకా అక్కడే ఉన్నాడు. లోపలి గదిలోంచి వరలక్ష్మి ఏడుపు వినవస్తోంది. మరో గదిలో మొగుడి కేదో నచ్చచెప్తోందనుకొంటాను, వరలక్ష్మి తల్లి. "వెంక

టేశూ, మీ అయ్యగార్ని పిలు," అన్నాను. వెంకటేశు కూర్చున్న చోటు నుండి కదల్లేదు. నా గొంతు వింటూనే, వరలక్ష్మి బయటకు వచ్చింది. ఏడ్చి ఏడ్చి కళ్ళు వాచిపోయి ఉన్నాయి. వరలక్ష్మి చెయ్యిపట్టుకొని, ఆమె తల్లి దండ్రులున్న గదిలోకి దారితీశాను. నన్ను చూస్తూనే, చౌదరి పళ్ళుకొరు కుతూ, మంచం దిగాడు. చౌదరి ఏదో అరవకముందే, నేనే అన్నాను. "ముఠా తత్వాలతో నలిగిపోతున్న మీ గ్రామంలో జరగబోయే దారుణాన్ని చెప్పడానికి వచ్చాను. మనిద్దరిమధ్యా పెద్ద ఘర్షణ జరిగిందని ఊరంతా పాకిపోయింది. నన్ను కొట్టించడానికి మీ ప్రతిపక్షం వాళ్ళన్ని ఏర్పాట్లూ చేశారు. నన్ను కొట్టించిన నేరం మీ మీదకు రావడం సహజం ! ఇదీ వాళ్ళు వేసిన పథకం. అంతమంది కలిసి నన్ను కొట్టించాలను కొంటే, నే నొక్కణ్ణే ఎదిరించలేను. నాకు చావంటే భయంలేదు. కాని యిప్పుడు చావడానికి, నా కిష్టంలేదు. ఎంచేతనంటే, నేను లేకుండా వరలక్ష్మి బ్రతకలేదు. అది నా కిష్టంలేదు. మీకూ యిష్టంలేదనుకొంటే, నన్ను రక్షించే భారం మీదే !" మాటల్లో మడత పేచీ పెట్టి, అక్కడే ఉన్న కుర్చీలో కూల బడ్డాను. నా కాళ్ళను పెనవేసికొని, వరలక్ష్మి నేలమీద కూర్చుండిపోయింది.

నా మాటల్లోని నిజం, చౌదరి హృద యంలో నాటుకుపోయింది. ముఖంలో తొట్రుపాటు గమనించాను. వరలక్ష్మి వైపు చూశాను. మమకారం పొంగు కొచ్చింది మొహంలో మార్పు కనిపిం చింది. "నువ్వు బయటకు రాకు ! ఇక్కడే ఉండు. గంటలో వస్తాను," అని గాలిలో మాటలు వదిలేసి, చౌదరి బయటకు వెళ్ళిపోయాడు. నేను చెప్పింది నిజమో, కాదో, విచారించ డానికి వెళ్ళాడని తెలుసు. వరలక్ష్మి తల్లి మమ్మల్నిద్దరినీ ఆప్యాయంగా చూసి, మా నూనాన మమ్మల్ని వది లేసి, వంటింట్లోకి వెళ్ళిపోయింది.

బాగా చీకటిపడిన తర్వాత చౌదరి తిరిగి వచ్చాడు. పొలంనుంచి ఓ అర డజనుమంది కమతగాళ్ళు వచ్చి, యింటికి ముందూ వెనకా కాపలా ఉన్నారు. నేను చౌదరి యింట్లోనే ఉన్నట్లు పైవాళ్ళకి తెలియకపోయినా, ముందు జాగ్రత్తలు తీసుకొన్నాడు.

"పద నాతో భోంచేద్దువుగాని," అన్నాడు ముక్తసరిగా. "తీరా యింత దూరం వచ్చిన తర్వాత, కతికితే అతక దేమో అన్న భయంగా ఉంది !" అన్నాను. చౌదరి నవ్వకుండా ఉండలేక పోయాడు. "నువ్వు నిజంగా అసాధ్యు డివే ! ఆ భయం అక్కర్లేదు, భోజ నానికి లే ! వరం, నువ్వు చెప్పి చూడు !" అన్నాడు. వరలక్ష్మి కళ్లలో వెయ్యిజ్యోతుల వెలుగు ! నన్ను చెయ్యి పుచ్చుకుని లాక్కువెళ్ళింది. భోజనం చేస్తూంటే చౌదరి అన్నాడు. "నేను ఎంత రాజీపడదా మనుకొన్నా,మనుస్సు కుదరటల్లేదు. నా చేతులమీదుగా ఈ

పెళ్ళి జరిగించలేను. నువ్వు వరలక్ష్మిని పట్నం తీసుకుపోయి, రిజిస్టర్ మేరేజి చేసుకో !" నా విస్తట్లో నెయ్యి వడ్డిస్తూన్న వరలక్ష్మి చేతిలోంచి, గిన్నె జారిపడింది. "మీ అంగీకారంతో జరిగినా, లోకం దృష్టిలో దొంగతనంగా పారిపోయి, పెళ్లి చేసికొన్నట్లుండడం నా కిష్టంలేదు. అది మీక్కూడా ఏమంత గౌరవం కనక ? నలుగు రెదురుగుండా మీరు నాకు వరలక్ష్మిని కన్యాదానం చేయవలసిందే !" నే నన్న మాటలకి చౌదరి కొంత సేపటివరకూ సమాధానం యివ్వలేదు. "సరే నీ యిష్టప్రకారమే జరుగుతుంది. నువ్వన్న మాటల్లో నిజం లేకపోలేదు !" అన్నాడు. వరలక్ష్మి వాళ్ళ నాన్న విస్తట్లో గిన్నెడు పెరుగూ బోర్లించింది !

ఆ మర్నాడు నలుగురి సమక్షంలోనూ, రామాలయంలో నాకూ, వరలక్ష్మికి పెళ్లి జరిగిపోయింది. ఊరంతా ముక్కుమీద వేలేసుకొంది.

అయితే పాపం, నేనుండే యింటి యజమానిని, నా ఆచూకీ చెప్పమని నాలుగు తన్నారట - నన్ను తన్నవలసిన రాత్రి ! ఆయన్ని క్షమించమని కోరాను. మమ్మల్నిద్దర్నీ మనసారా దీవించాడు. అంతకంటె కావలసిందేముంది ?

మారుతున్న వ్యవస్థలో, వర్ణవిభేదాలని విసర్జించలేనప్పుడు కొంత కష్టం కలగక మానదు. నా తల్లిదండ్రులకి కొంతకాలం దూరం అయ్యాను. అయితే వరలక్ష్మి ఆడపిల్లను కన్నతర్వాత రెండు కుటుంబాలూ దగ్గరపడ్డాయి.

అధికార దాహం ఉన్న మనిషి, తన వారసుడు కూడా గట్టివాడుగానే ఉండాలని చూస్తాడు. అందుకనే, చౌదరి నన్ను అల్లునిగా చేసుకోగలిగాడు. ఇంతకూ చెప్పొచ్చేదేమిటంటే, నేనిప్పుడు రాష్ట్ర శాసనసభ్యుణ్ణి ! కారణం – నేను ప్రెసిడెంటు గిరీ వెలిగించినప్పుడు, ఊరు బాగుపడింది. ముఠాతత్వాలు సమసిపోయాయి. వర్ణాంతర వివాహాలు దగ్గరుండి జరిపించాను. శ్రమదానాన్ని ఆదర్శంగా చూపి, ఊరి యువకుల్నందర్నీ ఒక త్రాటిమీద నడిపించాను. ఫలితంగా చెరువులు బాగుపడ్డాయి. రోడ్లు బాగుపడ్డాయి. పంచాయితీ రాజ్యాన్ని రామరాజ్యంగా నడిపాను.

అన్నిటికంటె సంతృప్తికరమైన విషయ మేమిటంటే – అధికారం చేపట్టటానికి, అక్రమమార్గా లవసరంలేదని నిరూపించాను.

"నిన్ను మంత్రిగా చూడాలయ్యా!" అంటాడు మామ, చౌదరి. ఈ రాజకీయ పరమపద సోపానపటంలో పాములవాత పడకుండా, నిచ్చెన మెట్లెక్కడానికి- ప్రజాసేవే ఆదర్శంగా, ఆయుధంగా నమ్ముకొన్నాను నేను. ఏమవుతుందో చూద్దాం !